క్లుప్తంగా

మిస్సింగ్ కేసులపై ఆరా



జూమ్ కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో వివిధ స్టేషన్లలో అపరిష్కృతంగా ఉన్న మిస్సింగ్ కేసులపై ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి శుక్రవారం ఆరా తీశారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినుల కేసులపై డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జూమ్ కాన్ఫరెన్సులో సమీక్షించారు. దర్యాప్తులో పురోగతి సాధించాలని, పూర్తయ్యాక కేసు వివరాలను సీసీటీఎన్ఎస్ పోర్టల్ నందు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాద బాధితులకు నష్టపరిహారాన్ని త్వరితగతిన అందేలా పోలీసు చర్యలుండాలన్నారు. వర్చువల్ సమీక్షలో అదనపు ఎస్పీ కె.వి.రమణ పాల్గొన్నారు.

పదోన్నతులకు అడ్డంకిగా నూతన బదిలీ చట్టం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన బదిలీ ముసాయిదా చట్టంతో భవిష్యత్తులో ఎస్సీ ఎస్టీ టీచర్ల పదోన్నతులకు అడ్డంకిగా మారనుందని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీర రమేష్‌బాబు, పడాల ప్రతాప్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టడీ లీవుపై ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు వారు పనిచేస్తున్న స్థానాన్ని బదిలీల్లో ఖాళీగా చూపిస్తామంటూ నూతన బదిలీ చట్టంలో పేర్కొనడం విచారకరమన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



గురునాయుడును పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వెంకటరావుపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బూర్లె గురునాయుడును మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. ఆయనతో పాటు రణస్థలం మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, యూత్ ప్రెసిడెంట్ దన్నాన హరి, నాయకులు గురాన చిరంజీవి, పరిసినాయుడు, లక్ష్మనాయుడు, గోవింద ఉన్నారు.

తెలగ కులస్తులను బీసీ-బీలో చేర్పించాలి

జి.సిగడాం : ఉత్తరాంధ్రలో తెలగ కులస్తులకు బీసీ రిజర్వేషన్ కల్పించేందుకు ఐక్య పోరాటాలు చేయాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం నాయకులు పల్లంటి వెంకటరమణారావు(పీవీఆర్) పిలుపునిచ్చారు. శుక్రవారం సంతవురిటిలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలగ కులస్తులను బీసీ-బీ జాబితాలో చేర్పించి అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేష్, సర్పంచ్‌లు బత్తుల వెంకటకృష్ణారావు, పలిశెట్టి సూర్యనారాయణ, ధారబోయిన ధర్మరాజ్, మానం సత్యారావు, బాలబొమ్మ చిన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

12న మహాధర్నా

గార: ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికుల డిమాండ్ల సాధనకు ఈ నెల 12న విజయవాడలో జరుగుతున్న మహాధర్నా విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దాసరి లక్ష్మణరావు, సిర్ల మంగమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు సతివాడలో ఉపాధి హామీ వేతనదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. అదనపు పనిదినాలు, వేసవి అలవెన్సులు, పెండింగ్ వేతనాలు, ప్రమాదాల్లో మరణించిన పేద కుటుంబాలకు రూ.25 లక్షల సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎర్ర అప్పారావు, కళావతి, పి.రామారావు, దాసరి కుమారి పాల్గొన్నారు.

శ్రీకాకుళం తూర్పు మండల బీజేపీ అధ్యక్షురాలిగా లలిత

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరం తూర్పు మండల బీజేపీ అధ్యక్షురాలిగా కనుగుల లలితకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో పోలింగ్ బూత్ అధ్యక్షులు, క్రియాశీల సభ్యులు, జిల్లా కోర్ కమిటీ సభ్యుల సమక్షంలో ఈ ఎన్నికల ప్రక్రియ జరిగింది. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అధికార లాంఛనాలతో హెచ్‌సీ అంత్యక్రియలు

రణస్థలం: తెప్పలవలస పంచాయతీ కొత్తపేటకు చెందిన బుడుమూరు గవరయ్య(61) హెడ్ కానిస్టేబుల్‌గా విధి నిర్వహణలో మృతి చెందారు. మందస పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఈయన ఈ నెల 5న గుండె పోటుతో మృతి చెందడంతో శుక్రవారం అధికార లాంఛనాలతో స్వగ్రామంలో అంత్యక్రియలు జరిపారు. పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. గవరయ్యకు భార్య సూర్యకుమారి, ఇద్దరు కుమారులు శరత్‌కుమార్, జీవన్‌కుమార్ ఉన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి



టెక్కలి మండలం పోలవరం గ్రామానికి చెందిన అమ్మోజి యువ రచయిత్రిగా, సచివాలయ మహిళా పోలీసుగా, సామాజిక కార్యకర్తగా విశేష సేవలందిస్తున్నారు. మదర్ థెరిసా ట్రస్టులో ముగ్గురు చిన్నారులను దత్తత తీసుకొని ఏడేళ్లుగా వారి యోగక్షేమాలు చూస్తున్నారు. 350 కవితలు, 45కథలు, 80కి పైగా పుస్తక సమీక్షలు, 18 పుస్తకాలకు సంపాదకత్వం ద్వారా సాహిత్య సేవ అందిస్తున్నారు. ఐదు సార్లు జాతీయ అవార్డులు అందుకుని, 6 ప్రపంచ రికార్డులు సాధించారు. ప్రస్తుతం రణస్థలం మండలం కోష్ఠ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. - శ్రీకాకుళం కల్చరల్



తండ్రి తాపీ మేస్త్రి.. కుమార్తె ఐఏఎస్

శ్రీకాకుళం రూరల్ మండలం ఒప్పంగి గ్రామానికి చెందిన చల్ల అసిరినాయుడు, సత్యవతి దంపతుల రెండో కుమార్తె చల్ల కల్యాణి ఐఏఎస్ సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. తండ్రి తాపీమేస్త్రిగా పనిచేస్తూనూ ముగ్గురు కుమార్తెలను బాగా చదివించారు. తండ్రి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పంచాయతీ కార్యదర్శిగా, ట్రెజరీ అధికారిగా పనిచేశారు. సివిల్స్ సాధించి ప్రస్తుతం కర్నూలు జిల్లాలో సబ్ కలెక్టర్ శిక్షణ పొందుతున్నారు. - గార



సత్కారం అందుకుంటున్న చల్ల కల్యాణి(ఫైల్)

మహిళల భద్రత నిర్లక్ష్యం దిశ గా..

- మూలకు చేరిన దిశా సైబర్ కవచ్ యంత్రం
- గత ప్రభుత్వంలో విశేషంగా సేవలందించిన మెషీన్
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో మూలకు చేరిన వైనం
- మహిళలకు తప్పని సైబర్ నేరగాళ్ల వేధింపులు

శ్రీకాకుళం క్రైమ్: మన ఫోన్‌లో డేటా మనకు తప్ప ఎవరికీ తెలియదనే నమ్మకంతో ఉంటాం. అయితే సైబర్ కేటుగాళ్ల కన్నుపడిందా అంతే సంగతులు. ముఖ్యంగా మహిళలకు వేధింపులు తప్పవు. వ్యక్తిగత సమాచారం సేకరించి లింకులు, యాప్‌ల ద్వారా అకౌంట్లలోని సొమ్మును ఖాళీ చేస్తుంటారు.

- వందలాది ఫొటోలను చాలామంది సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు. ప్రొఫైల్ పిక్స్‌కు లాక్ పెట్టుకోరు. మహిళల విషయంలో ఇది అంత మంచి పద్ధతి కాదని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- సైబర్ నేరస్తులు ఐడెంటిటీ థెఫ్ట్ ద్వారా మహిళలు, యువతుల ఫొటోలు, వీడియోలు దొంగిలించి వాటిని మార్ఫింగ్ చేస్తారు. ఇంటర్‌నెట్ / సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తామని బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బును దోచుకోవడం, లైంగికంగా వేధించడం వంటి పనులు చేస్తారు.
- వాట్సాప్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి యాప్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లే కాక ఫ్రెండ్స్ ముసుగులో కొందరు యువతులను, మహిళలను మోసగించాలని చూస్తారు.
- అసభ్య చాట్స్, న్యూడ్ వీడియోకాల్స్‌కు ప్రేరేపించి వాటిని రికార్డు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని, ఫ్యామిలీ / ఫ్రెండ్స్‌కు పంపిస్తామని బ్లాక్ మెయిల్ చేసి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. హనీ ట్రాప్‌లో ఇది ఒక కొత్త తరహా నేరం. ఈ సైబర్ నేరాల్లో స్త్రీలే ఎక్కువగా బాధితులు.




నేడు | ఎస్పీ ఆఫీసులో మూలకు చేరిన సైబర్ కవచ్ మెషీన్



నాడు | దిశ సైబర్ కవచ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రాధిక(ఫైల్)

ఈ చిత్రంలో దుమ్ముపట్టి మూలకు చేరిన యంత్రం ఏమిటో తెలుసా..!

దీని పేరు దిశ సైబర్ కవచ్ ఇది. సైబర్ కేటుగాళ్ల నుంచి రక్షణగా ముఖ్యంగా మహిళల భద్రత కోసం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంత్రం ఇది. దీని ఉపయోగమేమిటో తెలుసా.. మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సైబర్ మానిటర్‌కు కనెక్ట్ చేసి స్కాన్ చేస్తే అందులో ఉన్న వైరస్, సైబర్ మాల్వేర్‌తో పాటు మనకు తెలియకుండా ఇన్‌స్టాల్ అయిన యాప్‌లను కూడా గుర్తించి వాటిని తొలగించేది. దీనికోసం ప్రత్యేకంగా ఓ పోలీసు సహాయకున్ని సైతం నియమించారు. మొబైల్ ఛార్జింగ్ పిన్ నుంచి యూఎస్‌బీ కేబుల్ ద్వారా మెషిన్‌కు అనుసంధానిస్తే మొబైల్‌లో ఉన్న సమాచారాన్ని బట్టి వైరస్‌ను గుర్తిస్తుంది. మొబైల్‌లో తెలియకుండా యాప్‌లు, సాఫ్ట్‌వేర్‌లు గుర్తిస్తుంది. వాటిని వెంటనే డిలీట్ చేసుకోవచ్చు. ఈ మోనిటర్ ద్వారా ఎటువంటి వ్యక్తిగత సమాచారం తస్కరించబడదు. ప్రజలకు ముఖ్యంగా మహిళలు, విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడే ఈ మిషన్ ఇప్పుడు దుమ్ము ధూళితో తుప్పు పట్టి ఎస్పీ కార్యాలయంలో ఓ మూలకు చేరడం పలువురినీ విస్మయపరుస్తోంది. కూటమి ప్రభుత్వ తీరును పలువురు తప్పుబడుతున్నారు.



జిల్లాలో కొన్ని సైబర్ మోసాలు..

- ఇటీవల జిల్లాకేంద్రంలో ఓ విద్యార్థిని ఫొటోలు, వీడియోలు తస్కరించిన తిరుపతి యువకుడు అశ్లీల వెబ్‌సైట్లలో పెట్టాడు. మరో యువకుడు వాటిని డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాగామ్, వాట్సాప్ తదితర యాప్‌ల్లో పంపి సొమ్ము చేసుకున్నాడు.
- జిల్లాలోని ఓ గ్రూప్-1 మహిళా అధికారిణిని కొన్ని నెలల కిందట ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా న్యూడ్ చిత్రాలు, వీడియోలు రూపొందించి సైబర్ కేటుగాళ్లు మోసం చేద్దామనుకున్నారు. ఆమె అప్రమత్తం కావడంతో తృటిలో తప్పించుకోగలిగింది.
- జిల్లా స్త్రీ శిశు సంక్షేమాధికారి బి.శాంతిశ్రీని సైతం సైబర్ ఉచ్చులో పడి తృటిలో తప్పించుకున్నారు.
- ఎంతో మంది విద్యార్థినులు తమకు ఇన్‌స్టా, వాట్సాప్ యాప్‌ల్లో యువకులు వేధింపులు ఎక్కువయ్యాయని ఎప్పటికప్పుడు సైబర్‌సెల్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆర్ట్స్ కళాశాలలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న వర్సిటీ, కళాశాల అధికారులు



మహిళాన్వితం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగాలని, ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధించాలని వక్తలు ఆకాంక్షించారు. - సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం పీఎన్‌కాలనీ: హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళకు సన్మానం



ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో విజేతలకు బహుమతుల ప్రదానం



ఎచ్చెర్ల: లావేరు మండలం గుర్రాలపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళామణులకు నివాళులు

సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక అంశాలపై పట్టు సాధించాలని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ అన్నారు. శ్రీకాకుళం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో శుక్రవారం జరిగిన టెక్నివర్స్ -2025 జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పారిశ్రామిక అవసరాలు దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో, ఆర్టు గ్యాలరీలను తిలకించారు. జోధ్‌పూర్ ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ వివేక్ విజేయ్ ఇంజినీరింగ్‌లో విస్తరిస్తున్న సాంకేతిక ప్రగతిపై మాట్లాడారు. శాస్త్రవేత్తలు పరిటాల శివాజీ, వల్లభనేని కీర్తి ప్రసంగించారు. కన్వీనర్ గేదిల రవి, సహాయ కన్వీనర్ తేజీకిరణ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్స్ కొర్ల మోహన కృష్ణచౌదరి పాల్గొన్నారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న వీసీ విజయ్‌కుమార్, అధికారులు

మహిళా సాధికారతే లక్ష్యంగా ఉచిత టైలరింగ్ శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని వెనుకబడిన తరగతుల మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణను జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ (బీసీ కార్పొరేషన్) నిర్వహిస్తోందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను, దారిద్ర్య రేఖకు దిగువున్న గ్రామీణ పేదలకు ఈ పథకం (బీపీఎల్) కింద 18-50 సంవత్సరాల మధ్య వయస్సు గల వెనుకబడిన తరగతులు, కాపు (తెలగ, బలిజ, ఒంటరి), అగ్రవర్ణాలలోని పేద (ఈడబ్ల్యూఎస్) వర్గాలకు చెందిన మహిళలకు ఈ శిక్షణ ఇస్తారు. మహిళల అభివృద్ధికి తోడ్పడే ఈ శిక్షణలో పాల్గొనాలనుకునే అర్హులైన అభ్యర్థులు తమ పూర్తి వివరాల కోసం సంబంధిత గ్రామ/వార్డు సచివాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి లేదా మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించవచ్చు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ కూడా అందిస్తారు.

కేజీబీవీ ఉపాధ్యాయినుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఉపాధ్యాయినులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, దశలవారీగా రెగ్యులర్ చేయాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చందనరావు, జిల్లా అధ్యక్షులు సప్పటి మల్లేసు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ జిల్లా కార్యాలయంలో ఏపీసీ సంపతిరావు శశిభూషణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీల్లో పనిచేస్తున్న అందరికీ మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ప్రతి విద్యాలయానికి వార్డెన్‌ను నియమించాలని, పీఎఫ్, హెల్త్ కార్డులు సౌకర్యం కల్పించాలని, ప్రతి నెలా మొదటి వారంలోనే వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని, మరణించిన ఉపాధ్యాయినులకు అంత్యక్రియల ఖర్చులు, ఎక్స్‌గ్రేషియా మంజూరుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విన్నవించారు.



సమగ్రశిక్ష ఏపీసీ శశిభూషణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న చందనరావు, మల్లేసు

ఘనంగా యల్లమ్మ సిరుల యాత్ర

గార/శ్రీకాకుళం కల్చరల్: వమరవెల్లి యల్లమ్మ తల్లి సిరుల యాత్ర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. గార ఎస్ఐ ఆర్.జనార్దన్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలోని గాజుల వీధిలో యల్లమ్మ జంగిడిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపు అనంతరం ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కెళ్లవీధిలో యల్లమ్మ సిరుల యాత్ర ఘనంగా జరిగింది. కెళ్లవారింటికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



వమరవల్లిలో యల్లమ్మ తల్లి ఆలయం వద్ద భక్తులు

24,25 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగుల సమ్మె

శ్రీకాకుళం అర్బన్: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో దాదాపు పది లక్షల ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఈ నెల 24, 25 తేదీల్లో సమ్మెకు దిగుతున్నట్లు యూనియన్ ప్రతినిధులు ప్రకటించారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ శ్రీకాకుళం కన్వీనర్ కేసీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయం వద్ద ఉన్న ఇండియన్ బ్యాంక్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ కృష్ణకిషోర్, లోకల్ సెక్రటరి నాయుడు, కిషోర్, మండ శ్రీనివాసరావు, ఏఐబీఈఏ శ్రావణి, ఎస్‌బీఐ ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ప్రభుత్వరంగ బ్యాంక్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌లను కేంద్రప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, ఐబోక్ రీజనల్ కార్యదర్శి కె.తేజేశ్వరరావు, కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు గిరిధర్ నాయక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షురాలు జి.కరుణ, కోఆర్డినేషన్ జాయింట్ కార్యదర్శి ఏ.సూర్య, ఓబీసీ ఉద్యోగ సంఘ నాయకులు సూర్యకిరణ్, నరేష్, శ్రీనివాస్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌జీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

లక్ష్యంతో ముందుకుసాగాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థినులు లక్ష్యంతో ముందుకు సాగాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ అన్నారు. కుశాలపురం పరిధిలోని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళల పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులకు రిలీవ్ నాటికి ప్లేస్‌మెంట్లు లభిస్తుండటం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పొగిరి సుగుణాకర్‌రావు, ప్రిన్సిపాల్ విక్టర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీఓగా మల్లేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్‌డీ బి.మల్లేశ్వరరావును నియమిస్తూ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఎంపీడీవోగా ఉన్న సీపాన హరిహరరావు మార్చి 5 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు దీర్ఘకాలిక సెలవు పెట్టిన సంగతి తెలిసిందే.

ఉపాధి సామాజిక తనిఖీలపై అవగాహన

రణస్థలం: ఉపాధి సామాజిక తనిఖీలపై ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండాలని ఎస్ఆర్‌జీఎస్ విజిలెన్స్, ఫైనాన్స్ మేనేజర్ ఆర్.స్వరూపరాణి తెలిపారు. రణస్థలం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సామాజిక తనిఖీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు పిన్నింటి సాయికుమార్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, ఏవో ధనుంజయరావు, పంచాయతీరాజ్ ఏఈ అప్పన్న, ఎస్ఆర్‌పీ తులసి నాయక్, ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు, వైస్ ఎంపీపీ మైలపల్లి కామరాజు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు రెడ్డి విశ్వేశ్వరరావు, సర్పంచులు, ఎంపీటీలు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని చినబజారు సమీప ధర్మాన టీవీఎస్ ఎదురుగా బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి గాయాలతో అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానికులు స్పందించి పోలీసుల సహకారంతో ఆస్పత్రి చేర్పించారు. ఆ వ్యక్తి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించినట్లు రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు తెలిపారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10గంటలకు జిల్లాలో 18 బెంచీలలో అదాలత్ జరుగుతుందని, క్రిమినల్, సివిల్, మోటార్, యాక్సిడెంట్, ఎన్ఐ యాక్ట్, మాట్రిమోనియల్, ఎక్సైజ్ తదితర కేసులు రాజీ చేసుకోవాలని కోరారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

శ్రీకాకుళం క్రైమ్ : హోంగార్డు బుక్కా నాగరాజు మృతిచెందడంతో ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూతగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరడ్డి శుక్రవారం రూ.4.10 లక్షల చెక్‌ను అందజేశారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.